www.samasamajam.in

# సమ సమాజం

తెలుగు దిన పత్రిక

తెలంగాణ | బుధ వారం, 20 జూలై 2022 | ఎడిటర్: గోనుకొండ పృధ్విరాజు | సంపుటి - 07, సంచిక-106 | పేజీలు - 4 వెల రూ. 5/-

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak

# రూపాయి మారక విలువ 80కి చేరిక

డాలర్ రేటుతో పోలిస్తే అత్యంత దారుణంగా విలువ ■ భారీ పతనంపై మండిపడుతున్న విపక్షాలు ■ మోడీ సర్కార్ వైఫల్యమేనని విమర్శలు



**న్యూఢిల్లీ, జూలై 19 (సమ సమాజం):** అచ్చే దిన్ అంటూ అధికారంలోకి వచ్చిన మోడీ పాలనలో రూపాయి విలువ పతనం కొనసాగుతూనే ఉంది. డాలరుతో రూపాయి మారకం విలువ చరిత్రలోనే తొలిసారి దారుణంగా దిగజారిపోయింది. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ మంగళవారం చరిత్రలో తొలిసారి 80 రూపాయిలు దాటి దిగజారింది. ఈ భారీ పతనంతో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై మండిపడుతున్నాయి. కాంగ్రెస్ తోపాటు ఇతర పార్టీలు నిరంతరం ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నాయి. బీజేపీ అధికారంలోకి వచ్చిన 8 ఏళ్ల నుంచి ఇప్పటివరకూ డాలర్‌తో రూపాయి మారకం విలువ 25శాతం క్షీణించింది. ఇదే విషయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. 2014 డిసెంబర్లో మోడీ అధికారంలోకి వచ్చాక డాలర్ తో రూపాయి మారకం విలువ రూ.63.33గా ఉండేది. 2022 జులై 11 నాటికి దాని విలువ 79.41కి పడిపోయింది. జూన్ 30న డాలర్ తో రూపాయి మారకం విలువ రూ.78.94గా నమోదైంది. సోమవారం 16 పైసలు కోల్పోయి రూ.79.98వ వద్ద ముగిసింది. మంగళవారం వచ్చేసరికి రూ.80 దాటేసి ఆల్ టైం చరిత్రలోనే తొలిసారి అత్యంత క్షీణతను నమోదు చేసింది. రష్యా-ఉక్రెయిన్ పరిణామాలతో చమురు ధరలు పెరగడం.. అంతర్జాతీయంగా ఆర్థిక పరిస్థితులు రూపాయి విలువపై ప్రతికూల ప్రభావాన్ని చూపాయని

2వ

## ఇవి ఏటా వచ్చే వరదలే: తమిళిసై

క్లౌడ్ బరస్ట్ వల్ల కాదన్న గవర్నర్



**యానాం, జూలై 19 (సమ సమాజం):** క్లౌడ్ బరస్ట్‌పై తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు వచ్చిన గోదావరి వరదలు క్లౌస్ బరస్ట్ వల్ల కాదని ఆమె అన్నారు. ఇవి ఎగువ ప్రాంతంలో ఎప్పుడూ వచ్చే వరదలే అని.. కాకపోతే ఈసారి కాస్త ఎక్కువ వరదలు వచ్చాయని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. యానాంలో వరద పరిస్థితిపై సమీక్ష నిర్వహించిన అనంతరం మంగళవారం మీడియాతో మాట్లాడుతూ తమిళిసై ఈ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించిన తెలంగాణ సీఎం కేసీఆర్.. క్లౌడ్ బరస్ట్ వల్లే చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీ వరదలు సంభవించి ఉంటాయని అనుమానం వ్యక్తం చేశారు. విదేశాలే ఈ కుట్ర చేసి ఉంటాయని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ మాటలకు పూర్తి విరుద్ధంగా ఇప్పుడు గవర్నర్ తమిళిసై మాట్లాడటం గమనార్హం.

## నాణ్యమైన విద్య తెలంగాణ లక్ష్యం

వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, జూలై 19 (సమ సమాజం):** ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించడమే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం అని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. మంగళవారం చిన్నంబావి మండల కేంద్రంలో రూ.3.8 కోట్లతో నిర్మించిన కేజీబీవీ పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించి మంత్రి మాట్లాడారు. విద్యతో పాటు వైద్యం మీద తెలంగాణ ప్రభుత్వం దృష్టి పెట్టిందని మంత్రి తెలిపారు. ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బులు విద్య, వైద్యానికి ఖర్చు చేసే పరిస్థితి రాకూడదన్నది సీఎం కేసీఆర్ ఆలోచన అన్నారు. రాష్ట్రంలో 29 వేల ప్రభుత్వ పాఠశాలలలో సౌకర్యాల కల్పనకు మన ఊరు మనబడి పథకం ప్రారంభించిందని ఆయన గుర్తు చేశారు. సర్కారు బడుల వైపు విద్యార్థులను మళ్లించేందుకు ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కృషి చేయాలని ఆయన సూచించారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ లోక్ నాథ్ రెడ్డి,ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## రాష్ట్రపతి ఎన్నికల బాక్స్ తరలింపు

ప్రత్యేక భద్రత మధ్య ఢిల్లీకి చేరవేత




**హైదరాబాద్, జూలై 19 (సమ సమాజం):** రాష్ట్రపతి ఎన్నికల బ్యాలెట్ బాక్సును అధికారులు ఢిల్లీకి తరలించారు. దేశవ్యాప్తంగా సోమవారం నాడు రాష్ట్రపతి ఎన్నికలు నిర్వహించిన సంగతి తెలిసిందే. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఈ ఎన్నికలు జరిగాయి. సీఎం కేసీఆర్ సహా దాదాపు నేతలంతా తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ ఎన్నికల బ్యాలెట్ బాక్సును సాయంత్రం అసెంబ్లీలోని లాకర్ రూంలోనే జాగ్రత్త చేసిన అధికారులు.. తెల్లారగానే వాటిని ఢిల్లీ తరలించారు. ఎన్నికల అధికారులు ఈ బాక్సును తీసుకొని ఢిల్లీ బయలుదేరినట్లు తెలుస్తోంది. 16వ రాష్ట్రపతి ఎన్నికకు నిన్న జరిగిన పోలింగ్‌లో భాగంగా.... అసెంబ్లీలో 117మంది శాసన సభ్యులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ ముగిశాక.... సాయంత్రం 5 గంటల తర్వాత ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సును సీల్ చేసి..... స్టోర్ రూంలో భద్రపరిచారు. తెల్లవారుజామున అసెంబ్లీ అధికారులు పటిష్ఠ భద్రత మధ్య శంషాబాద్ విమానాశ్రయం నుంచి దిల్లీకు తీసుకువెళ్లారు.

## బీజేపీ టీఆర్ఎస్ రాజకీయ క్రీడ

200కోట్ల విలువైన ధన్యాం వృధా: రేవంత్ ట్వీట్



**హైదరాబాద్, జూలై 19 (సమ సమాజం):** బీజేపీ టీఆర్ఎస్ రాజకీయ క్రీడలో 2 వందల కోట్లు విలువైన ధాన్యం నీళ్ల పాలైందని పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. ఇవి మోడీ, కేసీఆర్ జేబులో డబ్బులు కాదంటూ ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రజల రక్తం, చెమట ధారపోసి కట్టిన పన్నుల సొమ్మని రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు ప్రభుత్వాలకు బాధ్యత లేదంటూ ఫైర్ అయ్యారు. ప్రజలను ఆదుకోవడంలో ఇద్దరూ విఫలం అయ్యారని అన్నారు. ఇందులో వారి జేబుల్లోంచి పైసా ఇవ్వడం లేదన్నారు. ఇది గుర్తించి వెటనే సాయం అందించాలన్నారు.

## టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలే ఉద్యోగాలు

2,80వేల ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత కెసిఆర్‌ది

మంత్రి హరీష్ రావు వెల్లడ




**సంగారెడ్డి, జూలై 19 (సమ సమాజం):** స్థానికులకే ఉద్యోగాలు దక్కాలన్న ఉద్దేశంతో 95శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దని మంత్రి హరీష్ రావు అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన

2వ

## కాళేశ్వరం ముంపునకు రీ డిజైనే కారణం

కెసిఆర్ తీరువల్లనే భారీ నష్టం

ముంపు మండలాలపై ఆనాడే హెచ్చరించాం

కాంగ్రెస్ నేత మల్లు భట్టి విక్రమార్క విమర్శలు



**హైదరాబాద్, జూలై 19 (సమ సమాజం):** వరద బాధితులను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుని, వారికి కావాల్సిన సహాయ, సహకారాలు అందించాలని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు. యుద్ధ ప్రాతిపదికన వరద బాధితులకు ప్రభుత్వం పరిష్కారం చూపించాలన్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలని, ఇల్లు కోల్పోయిన వారికి కొత్త ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. శాశ్వత ప్రాతిపదికన రాష్ట్ర ప్రభుత్వం యాక్షన్ ఎలాన్ రూపొందించి కావాల్సిన నిధులు కేటాయించాలని కోరారు. లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టును ఇరిగేషన్, ఇంజనీరింగ్ నిపుణులతో నిర్మించాల్సి ఉండేదని, 2014 నుండి తాము ఇదే చెబుతున్నామని మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణలో అత్యంత ఎత్తైన ప్రాంతమైన తమ్మిడిహట్టి దగ్గర అంబేద్కర్ పేరు మీద ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రారంభిస్తే.. దాన్ని రీ డిజైన్ పేరుతో కాళేశ్వరం అనే ప్రాజెక్టు కట్టారని, ఇప్పుడు దాని

2వ

## యజ్ఞంలా మనఊరు-మనబడి

కొత్తూరు పరిధిలో మంత్రి సబిత ప్రారంభం



**రంగారెడ్డి, జూలై 19 (సమ సమాజం):** మన ఊరు- మన బడి, మన బస్తీ-మన బడి కార్యక్రమాలను ఒక యజ్ఞంలా సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారని విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్, కొత్తూరు ప్రభుత్వ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో భాగంగా మంజూరైన పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా రూ.7,289 కోట్ల భారీ బడ్జెట్ తో 26 వేల పాఠశాలల్లో 12 రకాల పనులు చేపడుతున్నామన్నారు. చాలా వరకు ప్రైవేట్ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ఉండటంతో తల్లిదండ్రులు మొగ్గు చూపుతుండటంతో సీఎం కేసీఆర్ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ సంవత్సరం నుంచి ఆంగ్ల బోధనకు ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. విద్యాశాఖలో తీసుకుంటున్న సంస్కరణలు, మార్పులతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు భారీగా పెరిగిందన్నారు. సీఎం కేసీఆర్ వెయ్యి కి పైగా గురుకులాలు ప్రారంభించారు. ఒక్కో విద్యార్థి పై ప్రభుత్వం రూ. లక్షా 25 వేలు ఖర్చు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ అనితా రెడ్డి ,వైస్ చైర్మన్ గణెళిష్, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## వరదసాయం అందించడంలో కెసిఆర్ విఫలం

కెసిఆర్‌ను నమ్మితో గోసపడక తప్పదు

ప్రజలు బిజెపికి పట్టం కట్టేందుకు సిద్ధం: ఈటెల



**భూపాలపల్లి, జూలై 19 (సమ సమాజం):** తెలంగాణ సీఎం కేసీఆర్ ను నమ్మితే గోస పడుతారని రాష్ట్ర ప్రజలకు హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ సూచించారు. కెసిఆర్ అనేక హామీలు ఇచ్చి తుంగలో తొక్కారని మండిపడ్డారు. ఏ ఒక్క హామీని అమలు చేయలేదని అన్నారు. వరద సాయం అందించడం లోనూ నిర్లక్ష్యం తాండవిస్తోందన్నారు. తెలంగాణ గడ్డపై బీజేపీ ప్రభుత్వం రాబోతోందని, కేసీఆర్ ని ఓడగొట్టాలని ప్రతీ గ్రామం నిశ్చయంతో ఉందన్నారు. మంగళవారం భూపాలపల్లిలో ఈటల మీడియాతో మాట్లాడారు. వరదల వల్ల ముంపు గ్రామాల ప్రజలు సర్వస్వం కోల్పోయినట్లు, ముంపు బాధితుల నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 27 లక్షల క్యూసెక్కుల వరదలకు భారీగా నష్టం వచ్చిందన్నారు. వరదల సమయంలో అధికారులు విదేశాలకు వెళ్ళినట్లు.. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఇది సంభవించిందని విమర్శించారు. ఎస్సారెస్పీ నుంచి భద్రాచలం వరకు పరివాహక ప్రాంతాలు ముంపుకు గురయినట్లు, ముంపు బాధితులకు సరైన సహకారం అందట్లేదని తెలిపారు. ఇతరుల మీద నెపం నెట్టి సీఎం తప్పించుకుంటు న్నరు.. కేంద్రాన్ని సహాయం కోరాం, తప్పకుండా సహాయం చేస్తుందన్నారు. వరద సహాయంపై కేసిఆర్ ఉత్తుత్తి హామీలు ఇచ్చారని విమర్శించారు. తానే ఇంజనీర్ అని అనుకొనే సీఎం కేసీఆర్.. కాళేశ్వరం ముంపునకు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. 139 టీఎంసీ నీళ్ళు ఎత్తిపోస్తే, రూ. 3080 కోట్లు కరెంట్ బిల్లు వచ్చిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ఇంజనీర్ల మాటలు విని కాళేశ్వరంలో 3వ టీఎంసీ నిర్ణయం సీఎం కేసిఆర్ మానుకోవాలని హితవు పలికారు. వరదలను స్టడీ చేసి.. శాశ్వత పరిష్కారం చూడాలని ఎమ్మెల్యే ఈటల ప్రభుత్వానికి సూచించారు.

## ఎంజిఎంలో ఇద్దరు డాక్టర్ల సస్పెన్షన్

**వరంగల్, జూలై 19 (సమ సమాజం):** వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ముగ్గురు డాక్టర్లను సస్పెండ్ చేస్తూ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. క్యాజువాలిటీ విభాగంలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన డాక్టర్లు రితీష్, రంజిత్, రోగులకు కుట్లు వేసేందుకు రూ.350 డిమాండ్ చేసిన డాక్టర్ అంజాద్ అలీని సస్పెండ్ చేశారు.

## స్కూళ్లు తెరవని ఇద్దరు టీచర్ల సస్పెన్షన్

**నల్లగొండ, జూలై 19 (సమ సమాజం):** సెలవులు ముగిసినా పాఠశాలలను తెరవకుండా విధులకు హాజరుకాని ఇద్దరు ఉపాధ్యాయులను డీఈవో సస్పెండ్ చేశారు. నల్లగొండ జిల్లా డిండి మండలంలోఈ ఘటన జరిగింది. కందుకూరు, శాంతిగూడెం, బ్రహ్మణపల్లి, రుద్రాయిగూడెం, వావిల్‌కోల్, ఎర్రగుంటపల్లి, రమాంతపూర్, సింగరాజుపల్లి, తవక్లాపూర్, మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలల్లో జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి సోమవారం తనిఖీలు చేశారు. వారం రోజుల సెలవులు ముగిసిన తర్వాత కూడా తమ తమ పాఠశాలలను తెరవకుండా నిర్లక్ష్యం వహించిన శాంతిగూడెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు సంధ్య, బ్రాహ్మణపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు గొడుగు శ్రీనివాస్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

# సంపాదకీయం

## వరద గ్రామాలను రక్షించడమే లక్ష్యంగా సాగాలి!

ది. బాసర నుంచి ధవలేశ్వరం వరకు ఏ ఒక్క గ్రామాన్ని, లంకలను వదలకుండా వరద ముంచె త్తింది. దీంతో గ్రామాలన్నీ నీటమునిగి బురదలో కూరుకు పోయాయి. అలాగే వందలాది గ్రామాల్లో ఇంకా మురికినీటిలోనే మగ్గుతున్నాయి. పిల్లాపాపా, ముసలీ ముతకా అన్న తేడా లేకుండా చలికి వణుకుతూ చస్తున్నారు. వారి ఆలనాపాలనా ఇప్పుడు ముఖ్యం. అక్కడ తక్షణ సహాయక చర్యలే ప్రభుత్వాల ప్రధాన ఎజెండా కావాలి. వారికి భరోసా దక్కాలి. అందువల్ల ముందు ప్రజలను కాపాడుకోవాలి. ఇప్పటికీ తేరుకోలేక పోయిన ప్రజలు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ప్రాంతాల ప్రజలను ముందుగా బురద నుంచి రక్షించాలి. వారికి మంచినీరు, ఆహారం అందిస్తూ అంటువ్యాధులు సోకకుండా కాపాడాలి. గ్రామాల ను బురదనుంచి బయటపడేయాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన ఇప్పుడు వారిని ఆదుకునేందుకు రంగంలోకి దిగాలి. అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యరంగాలను అప్రమత్తం చేయాలి. గ్రామాలను ఆదుకునేందుకు పెద్ద ఎత్తున సహాయక చర్యలు అవసరం. అలాగే మందులు, మంచి నీరు, ఆహారం అందుబాటులోకి తీసుకుని రావాలి. ఓ వైపు సహాయక చర్యలు చేపడుతూనే మరోవైపు గ్రామాల పునర్నిర్మాణాలపై దృష్టి సారించాలి. ఇందుకోసం అధికార బృందాలతో పాటు ఆయా పార్టీలు సేవాదళాలు సహాయక చర్యల్లో పాల్గొనాలి. అన్ని పార్టీలు ఇందుకు ముందుకు రావాలి. తమ కార్యకర్తలను సహాయక చర్యల్లో దింపాలి. లక్షల సంఖ్యలో తమకు కార్యకర్తల బలం ఉందని చెప్పుకుంటున్న పార్టీలు ఇప్పుడు వారిని సహాయక చర్యల్లో దింపాలి. బురద రాజకీయాలు మాని, విమర్శలు కట్టిపెట్టి ప్రజలను ఆదుకునే లక్ష్యంతో ముందుకు కదలాలి. తీరప్రాంతాల్లో వరదముంపునకు గురయిన ఆయా జిల్లాల్లోని తాగునీటి వనరులన్నీ వరదనీటితో కలుషితమయ్యాయి. దీంతో ఏజెన్సీతో పాటు, అనేక గ్రామాల్లోని ప్రజానీకం అంటువ్యాధుల బారినపడే ప్రమాదం పొంచి ఉంది. ప్రతీ ఏటా వర్షాకాల సీజన్‌లో నీటి సంబంధిత వ్యాధుల నియంత్రణకు ఎన్ని పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నా డయేరియా, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి మహమ్మారులు విజృంభిస్తూనే ఉన్నాయి. తాజాగా భారీ వర్షాలు కురియడంతో వరదలు సంభవించి తాగునీటి వనరులన్నీ కలుషితమైపోయాయి. ఫలితంగా ప్రస్తుతం ఆ నీరు ఉపయోగించేందుకు వీల్లేకుండా మారిపోయింది. ప్రజలు నీటి సంబంధిత వ్యాధుల భారిన పడే అవకాశమందని నిపుణలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే స్పష్టం చేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాల అధికారులు రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించారు. ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ప్రజలు అంటు వ్యాధుల బారిన పడకుండా తగిన చర్యలు చేపట్టాలని ఉభయ తెలుగు రాష్ట్రాల సిఎంలు ఇప్పటికే అదేశించారు. అలాగే మందుల కొరత రాకుండా చూడాలని సూచించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే అవకాశమున్నందున పారిశుధ్య నిర్వహణపై ఫోకస్ పెట్టాల్సి ఉంది. అంటు వ్యాధుల ముప్పును నియంత్రించేందుకు వైద్యసిబ్బంది పూర్థిస్థాయిలో రంగంలోకి దిగాలి. ఇప్పటికే పారిశుద్య కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ నియంత్రణ సాధ్యం కావడం లేదు. కనుమరు గైపోయిందని భావించిన మలేరియా మళ్లీ విజృంభిస్తున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు గుర్తించారు. వరదల కారణంగా అంటువ్యాధులు ప్రబలే అవకాశాలు పొంచి ఉన్న నేపథ్యంలో, మలేరియా కూడా దాడిచేసే ప్రమాదం ఉంది. అంటువ్యాధులను కట్టడి కోసం పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, వైద్య ఆరోగ్యశాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోవాలి. ముఖ్యంగా పారిశుధ్యం నిర్వహణలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఏర్పడింది. ఈ క్రమంలో గ్రామాల వారీగా పారిశుద్ధ్య పనులు యుద్ద ప్రాతిపదికన చేపట్టాలి. అలాగే అంటువ్యాదుల నియంత్రణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలి. ఆయా శాఖల సిబ్బందిని పూర్తిస్థాయిలో అప్రమత్తం చేయాలి. వరద ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక నిఘా పెట్టాలి. వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలను వేగంగా చేపట్టేందుకు గ్రామాల ప్రజాప్రతినిధులతో కలిసి పనిచేయాలి. ప్రభుత్వం నేరుగా ఆయా గ్రామాల్లో సాగుతున్న సహాయక కార్యక్రమాలను పరిశీలిం చాలి. ప్రతి గ్రామంలో సర్పంచ్‌ను బాధ్యుడిగా, వార్డుమెంబర్లను కలుపుకుని ముందుకు సాగాలి. స్థానిక ప్రాజప్రతినిధులకు బాధ్యతలు అప్పగించాలి. ఇప్పటికే వందలాది గ్రామాల ప్రజలు సాయం కోసం ఎదురు చూస్తున్నాయి. జిల్లాల మంత్రలును అక్కడే ఉండేలా చేసి, ఎమ్మెల్యేలను కూడా రంగంలోకి దించాలి. ఆర్భాటాలు లేకుండా, ప్రచారాలకు దూరంగా సేవా కార్యక్రమాలు సాగాలి. ముంపు గ్రామాల ప్రజలకు ప్రభుత్వం అండగా ఉందని ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు నిరూపించుకోవాలి. కేవంల ప్రకటనలు ,సమీక్షలతో క్షేత్రస్థాయి సహాయక చర్యలను విస్మరించరాదు. ఇందుకు అవసరమైన నిధులను అందుబాటులో ఉంచాలి. కలెక్టర్లు కూడా బాధ్యతగా గ్రామాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలి.అలాగే పంటల నష్టాలను కూడా అంచనా వేయాలి. రైతులకు అండగా ఉన్నామన్న భరోసా కల్పించాలి. నష్టపోయిన రైతుల, ప్రజల జాబితాను పారదర్శకంగా రూపొందించి కేంద్రాన్ని సాయం కోరాలి. నివేదికలు పంపి ఒత్తిడి పెంచాలి. ఇందులో అందరూ భాగస్వామ్యం అయితేనే ఇది సాధ్యం అవుతుందని గుర్తించాలి.

పృద్విరాజ్ గోసుకొండ
ఎడిటర్

# అన్నదాతలను ఆదుకునేందుకు ముందుకు రావాలి

తక్షణం పంట నష్టాన్ని అంచనా వేసి సాయం అందించాలి ● కొత్త పంటలు వేసుకునేలా పెట్టుబడులు సమకూర్చాలి

**హైదరాబాద్, జూలై 19 (సమ సమాజం):** జిల్లాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటల స్థానంలో రైతులు కొత్త పంటలను వేసేందుకు ప్రత్యామ్నాయ ప్రణాళికను వ్యవసాయశాఖ సిద్ధం చేస్తోంది. పంటలు దెబ్బతిన్న గ్రామాల పరిధిలో రైతులకు అవగాహన కల్పించి మళ్లీ పంటలను వేయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. భారీ వర్షాలతో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరిగినా ఇప్పటికీ పరిహారంపై ప్రకటన లేదు.. ఇన్‌పుట్ సబ్సిడీపై జీవో లేదు. పాత జీవో సమయం ముగియడంతో ప్రస్తుతం పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందే పరిస్థితి కనిపించడం లేదు. వర్షాలకు దెబ్బ తిన్న పంటల కోసం ఇన్‌పుట్ సబ్సిడీని అందించేందుకు ఇప్పటి వరకు ఎలాంటి జీవోను విడుదల చేయలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పాత జీవో ప్రకారం వర్షాలకు పంటలు దెబ్బతింటే హెక్టారుకు 13,500 రూపాయలను ప్రభుత్వం అందజేసేది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రైతులకు ఈ నిధులను కేటాయిస్తారు. జిల్లాల వారీగా పంట నష్టం అంచనావేసి రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీనీ జమ చేస్తారు. అయితే జీవో మనుగడలో లేనందున ఈ దఫా వర్షాలకు దెబ్బతిన్న రైతులకు సహాయం అందించడం కష్టమేనని తెలుస్తోంది. ఆయా జిల్లాల్లో పంటల సాగుకోసం లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన కొద్దిరోజులకే వర్షాల వల్ల పంటలు నేలపాలు కావడంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మిగిలిన పంటలు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. ప్రభుత్వం జాతీయ విపత్తు కింద ఇచ్చిన జీవో గడువు ముగిసి రెండేళ్లు గడిసింది. ఇప్పటి వరకు కొత్త జీవోను విడుదల చేయలేదు. వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు పంటలు బాగా దెబ్బతిన్నాయి. వర్షాలు భారీ నుంచి అతి భారీ వర్షాలు పడటం వల్ల లక్షల ఎకరాల వరకు పంట దెబ్బతింది. వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల వారీగా దెబ్బతిన్న పంటల వివరాలను సేకరిస్తున్నారు. ప్రభుత్వానికి ప్రాథమిక అంచనాలతో కూడిన నివేదికను పంపుతున్నారు. ఈ వర్షాలకు వరి బాగా దెబ్బతింది. వరి, నారుమళ్లతో పాటుగా పత్తి, సోయా తదితర పంటలు దెబ్బతిన్నాయి. నాటువేసిన వారం రోజులలోపే భారీ వర్షాలు పడి పంట చేన్లలో నీళ్లు నిల్వడంతో ఈ పంట దెబ్బతింది. మొక్క జొన్న, పత్తి పంటలు వేల ఎకరాల వరకు దెబ్బ తింది. పంటలకు వేలాది రూపాయలు పంటలకు పెట్టుబడి పెట్టిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు. భారీగా పంటలు దెబ్బతినడంతో వ్యవ సాయశాఖ అధికారులు రైతులకు తక్కువ రోజులలో పండే పంటలపై అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. వాటికి సంబంధించిన విత్తనాలను సూచిస్తూ నేరుగా సాగుచేయాలని కోరుతున్నారు. నారుమళ్లు వేసి నాటు వేయాలని కోరుతున్నారు. ఆగస్టు చివరి వరకు అవకాశం ఉన్నందున సమయం మించిపోలేదని వివరించే ప్రయత్నం చేస్తున్నారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా విత్తనాలను అందుబాటులో ఉంచడంతో పాటు సొసైటీల ద్వారా సరఫరా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్, ఎంటీయూ విత్తనాలను అందుబాటులో ఉంచారు. రైతులు సమస్యలు ఎదుర్కోకుండా విత్తనాలు వెదజల్లే పద్ధతిలో సాగుచేయాలని కోరుతున్నారు. ఈ విధానంలో వరి వేయడం వల్ల పెట్టుబడి తగ్గడంతో పాటు దిగుబడి వస్తోందని వివరించే ప్రయత్నం చేస్తున్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలు కాపాడుకునేందుకు ఎరువుల వినియోగం పెంచడంతో 20 వేల మెట్రిక్ టన్నుల యూరియాను అందుబాటులో ఉంచారు. సొసైటీలు, డీలర్ల ద్వారా అధికారులు సరఫరా చేస్తున్నారు. ఈ క్రమంలో పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకు రావాలి. పరిహారం అందించి పంటలు వేసుకునేందుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందించాలి. ఇప్పటికే నకిలీ విత్తనాలు నట్టేట ముంచగా.. మొలకెత్తిన పంటలను చీడపీడల నుంచి కాపాడుకోగా భారీ వర్షాలు ముంచెత్తాయి. గత వారం రోజులుగా కురిసిన ముసురు అన్నదాతలకు నష్టం తెచ్చి పెట్టింది. ఎడతెరపి లేకుండా ముసురు కమ్మేయడంతో వరితో పాటు ఆరుతడి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పత్తి, సోయా, పెసర, మినుము, కంది లాంటి పంటలు ఇప్పుడిప్పుడే మొలకెత్తుతున్న సమయంలో ముసురు పంటతో చేనులోకి వరద భారీగా వచ్చి చేరడంతో పాటు ఆ పంటలు కాస్తా నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలను ఎలా కాపాడుకునేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలతో చేనుల్లోకి వరద వచ్చి చేరి పంటలు మునుగగా చేను చెరువుల మారిపోతుంది. పలు మండలాల్లో వర్షాలకు సుమారు వేల ఎకరాలకు పైగా వివిధ పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనలో తేలింది. వరితో పాటు ఆరుతడి పంటలను అన్నదాతలు విస్తారంగా సాగు చేస్తుంటారు. ఓ వైపు భారీ వర్షాలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తుండగా మరోవైపు ఈ ముసురు ఆరుతడి పంటల రైతులకు మాత్రం నష్టం చేకూర్చడంతో ఆందోళన చెందుతున్నారు.

# వాయిదాపడ్డ ఎంసెట్ రీ షెడ్యూల్

**హైదరాబాద్, జూలై 19 (సమ సమాజం):** భారీ వర్షాలు, వరదల కారణంగా ఈ నెల 13, 14, 15 తేదీల్లో జరగాల్సిన టీఎస్ ఎంసెట్ అగ్రికల్చర్, ఈసెట్ ప్రవేశ పరీక్షలు వాయిదా పడిన సంగతి తెలిసిందే. వాయిదా పడ్డ ఈ పరీక్షల తేదీలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఖరారు చేసింది. ఈ నెల 30, 31 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్ ప్రవేశ పరీక్షను, ఆగస్టు 1న ఈసెట్, ఆగస్టు 2 నుంచి 5వ తేదీ వరకు టీఎస్ పీజీఈసెట్ ప్రవేశ పరీక్షలను నిర్వహించనున్నారు. ఆయా వెబ్‌సైట్‌ల నుంచి సంబంధిత అభ్యర్థులు తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి సూచించారు.

# కాళేశ్వరం ముంపునకు రీ డిజైనే కారణం

(మొదటి పేజీ తరువాయి) వల్ల తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పంపు చేసి కాలువల ద్వారా ఇంత వరకు చుక్క నీరందించలేదన్నారు. ఇటు పోలవరం ప్రాజెక్టు కడితే అమాయక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. 2 లక్షల ఎకరాల భూమిని ఆంధ్రాకు కేటాయిస్తే వ్యతిరేకించాలని అనాడే చెప్పామని, తాము ఢిల్లీ వెళ్లి 7 మండలాల వల్ల ఖమ్మం జిల్లాకు జరిగే నష్టాన్ని సోనియాగాంధీకి తెలిపామని, దాంతో బిల్లులో నుంచి 7 మండలాలను తొలగించారని మల్లు భట్టి విక్కమార్క అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రధాని మోడీ బిల్లులో లేని 7 మండలాలను ఆర్డినెన్స్ రూపంలో ఆంధ్రప్రదేశ్ కు ధారాదత్తం చేశారని ఆరోపించారు. ఈ అంశాన్ని తాము వ్యతిరేకిస్తూ శాసనసభలో తీర్మానం చేసి, కేంద్రానికి కూడా పంపామని చెప్పారు. మహారాష్ట్రలో 3వేల ఎకరాలు ముంపునకు గురవుతుంటే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి తీర్మానం చేయలేదని, తెలంగాణ కు సంబంధించిన 2 లక్షల ఎకరాల ముంపునకు గురవుతుంటే తాము తీర్మానం చేశామన్నారు. ఆ తీర్మానాన్ని సీఎం కేసీఆర్ ఢిల్లీకి పంపించారా..? లేదా..? అని ప్రశ్నించారు. 7 మండలాలపై 8 సంవత్సరాల్లో అఖిలపక్షాన్ని ఎందుకు ఢిల్లీకి తీసుకుపోలేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వం పోలవరం కాపర్ డ్యామ్ కడుతూ ఉంటే మీరు (సీఎం కేసీఆర్) ఏం చేస్తున్నారని మల్లు భట్టి విక్రమార్క ప్రశ్నించారు. ముంపునకు గురై, ఆస్తి నష్టపోయిన బాధితుల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. ఇరిగేషన్, ఇంజనీరింగ్ నిపుణులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి, ముంపునకు గురి కాకుండా ఏం చేస్తే బాగుంటుందో సమగ్ర రిపోర్టు రూపొందించాలని డిమాండ్ చేశారు. ఆ 7 మండలాలు తిరిగి తెచ్చుకోవడానికి కేసీఆర్ ఏం చేస్తారో రాష్ట్ర ప్రజలకు చెప్పాలన్నారు. శాసనసభలో చేసిన ఏకగ్రీవ తీర్మానంపై స్పష్టత ఇవ్వాలన్నారు. 7 గిరిజన మండలాలు తెలంగాణలోనే ఉంటే ఆ భూములు ఆ అడవులు రాష్ట్రానికే ఉండేవి కదా..? అని ప్రశ్నించారు.

# మిషన్ భగీరథ పైపులు పలిగి నీరు కలుషితం

**భద్రాద్రి కొత్తగూడెం, జూలై 19 (సమ సమాజం):** మిషన్ భగీరథ అధికారులు మంగళవారం కీలక ప్రకటన చేశారు. ఇటీవల జిల్లాలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో భద్రాచలంలో మిషన్ భగీరథ కింద సరఫరా చేస్తున్న తాగునీరు కలుషితం అయ్యిందని వెల్లడించారు. తాగునీటి పైపులు, నల్లాలు పగిలి మంచినీరు కలుషితమై మురికి నీళ్లు వస్తున్నాయని తెలిపారు. దీంతో భద్రాచలం ప్రజలు మిషన్ భగీరథ నీళ్లు తాగొద్దని అధికారులు హెచ్చరించారు. వీలైనంత త్వరగా పైపులు, నల్లా శుభ్రం చేసి తాగునీరు అందిస్తామని వెల్లడించారు. అప్పుడు కూడా కాచి, చల్లార్చిన నీరు మాత్రమే తాగాలని సూచించారు. ఒకవేళ నీరు కలుషితం అయినట్లు అనుమానం వస్తే 7995660289, 9948139928 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని అధికారులు పేర్కొన్నారు.



# టిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక ఉద్యోగాలే ఉద్యోగాలే

(మొదటి పేజీ తరువాయి) తర్వాత 2,80,000 ఉద్యోగాలు భర్తీ చేసేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు చెప్పారు. కేంద్రం అగ్నిపథ్ పేరుతో ఉద్యోగ భద్రత లేకుండా చేసి యువతను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని హరీష్ రావు ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పోలీసు ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. యువశక్తిని వినియోగించుకోవడంతో కేంద్రం పూర్తిగా విఫలమైందన్న ఆయన.. బండి సంజయ్ కు దమ్ముంటే ఖాళీగా ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయించాలని సవాల్ విసిరారు. సంగారెడ్డి పర్యటనలో భాగంగా రూ.50కోట్ల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు మంత్రి హరీష్ రావు శంకుస్థాపన చేశారు. బీసీ బాలికల వసతి గృహ భవనానికి శంకుస్థాపనతో పాటు మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ ను ప్రారంభించారు. అనంతరం పలు మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేశారు.

# రూపాయి మారక విలువ 80కి చేరిక

(మొదటి పేజీ తరువాయి) మంత్రి పేర్కొన్నారు. భారత స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత మదుపర్లు పెట్టుబడులను తరలించుకు పోవడం కూడా ఓ కారణం. 2022-23లో ఇప్పటివరకూ 14 బిలియన్ డాలర్ల ఎఫ్‌ఐఐలు తరలిపోయాయని మంత్రి తెలిపారు. డాలర్ తో రూపాయి మారకం విలువ చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో అందుకే రూ.80 దాటేసింది. భవిష్యత్తులోనూ 82కు పడిపోవచ్చునని నిపుణులు అంచనావేస్తున్నారు. డాలర్ తో పోలిస్తే రూపాయి మారకం విలువ చాలా బలహీనపడుతుంది. కరోనా కారణంగా ఎకనామీ మందగించిన తర్వాత రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైంది. పశ్చిమ దేశాలు-రష్యాపై ఆంక్షలు విధించాయి. చాలా దేశాలు రష్యా నుంచి క్రూడాయిల్ కొనడం ఆపేశాయి. అంతర్జాతీయ మార్కెట్ లో చమురు గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయి.ఇది అమెరికా యూరప్ లను కూడా ప్రభావితం చేసింది.యుద్ధం కారణంగా ఆహార పదార్థాలు వంటనూనె తదితర వస్తువుల సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అమెరికా యూరప్ లు అత్యధిక ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొంటున్నాయి. రూపాయి విలువ బలహీనపడడానికి అతిపెద్ద కారణం ఆర్థిక వ్యవస్థ పతనం. అదుపులేని ద్రవ్యోల్బణం. వీటిని నియంత్రించడంలో మోడీ సర్కార్ వైఫల్యం ప్రధాన కారణంగా చెప్పొచ్చు. మోడీ వచ్చాక ధరలు భారీగా పెరిగాయి. ఏదైనా కొనాలంటే కొరివి.. అమ్మాలంటే అడివిలా తయారైంది పరిస్థితి. ద్రవ్యోల్బణం కారణంగా ధరలు విపరీతంగా పెరుగుతండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ముఖ్యంగా నిత్యావసరమైన పెట్రోల్ డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతుండడంతో సామాన్యులు జీవనం కష్టతంగా మారింది. పెట్రోల్ ధరలకు మాకు సంబంధం లేదని అంతర్జాతీయ స్థాయిలో ఉన్న క్రూడాయిల్ ధరలే నిర్ణయిస్తాయని కేంద్ర ప్రభుత్వం చెబుతోంది. అయితే పెట్రోల్ ధరలు మిగతా వస్తువులు ధరలపై కూడా ప్రభావం చూపుతాయన్నది నిర్వివాదాంశం. బీజేపీ ప్రభుత్వం రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం ధరలు అధికంగా పెంచుతోందని దీని వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ ఆరోపించింది. తాము అధికారంలోకి వస్తే రాముడి పాలన వస్తుందని చెప్పారు. కానీ ఇప్పటి ప్రజలు మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం కంటే బీజేపీ ప్రభుత్వమే ఇష్టం వచ్చినట్లు జనాలను కష్టపెడుతోందని ఆరోపిస్తున్నారు. గతంలో నోట్ల రద్దుతో జనాలను ముప్పు తిప్పలు పెట్టి తీవ్ర అవస్థలకు గురి చేసింది. 'నోట్ల రద్దుతో ఇప్పుడు కష్టాలు పడుతారు కానీ ఆ తరువాత మీరే చెబుతారు నోట్లు ఎందుకు రద్దు చేశారని' మోడీ ఆ సందర్భంలో అన్నారు. కానీ నానాటికీ నగదు కష్టాలు ఇంకా తీరడం లేనేలేదు. కొత్తనోట్లు చలామణి అవుతున్నా అనుకున్న సమయానికి బ్యాంకుల్లో లేకపోవడం వినియోగ దారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. మరోవైపు జాతీయ బ్యాంకులు ఇష్టం వచ్చినట్లు రేట్లు విధించడం.. బ్యాంకుల్లో కనీస నిల్వలు లేకపోతే ÷నై రూపంలో వసూలు చేయడం మొత్తానికి సామాన్యుడిని పీడిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇక డాలర్తో పోలిస్తే రూపాయి విలువ రోజురోజుకు దిగజారుతున్న పరిస్థితిని మనం చూస్తూనే ఉన్నాం. గతంలో కేవలం ఉల్లిపాయ ధరలు పెంచినందుకే కాంగ్రెస్ ప్రభుత్వాలను గద్దె దించిన ప్రజలు..మరి ఈసారి రూపాయి విలువ పతనం జీఎస్టీ నోట్ల రద్దు కష్టాలు పెట్రో వాతలపై ఈ ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి.

# రెండోరోజు ధరలపై దద్దరిల్లిన పార్లమెంట్

ధరలు, జిఎస్టీపై చర్చకు విపక్షాల పట్టు

ఆందోళనలతో ఉభయ సభలు వాయిదా




**న్యూఢిల్లీ, జూలై 19 (సమ సమాజం):** ధరల పెంపు, ద్రవ్యోల్బణంపై విపక్షాల ఆందోళనతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. వరుసగా రెండోరోజూ వాయిద పర్వం సాగింది. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు వాయిదా పడ్డాయి. ధరల పెంపు, ద్రవ్యోల్బణం పెరుగుదలకు నిరసనగా ప్రతిపక్షాలు నిరసన తెలిపాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఉభయ సభలను మధ్యాహ్నం రెండు గంటలకు వాయిదా వేశారు. వర్షాకాల సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. రాజ్యసభలో కాంగ్రెస్ సహా ఇతర విపక్ష పార్టీలు ధరల పెంపుపై ఆందోళన చేపట్టాయి. కొందరు సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లగా.. ఛైర్మన్ వెంకయ్య నాయుడు సభను మంగళవారానికి వాయిదా వేశారు. విపక్ష సభ్యుల ఆందోళనతో లోక్‌సభ మధ్యాహ్నం 2 గంటకు వాయిదా పడింది. లోక్ సభ ప్రారంభం అయిన కాసేపటికే ప్రతిపక్ష ఎంపీలు ధరల పెరుగుదలపై భగ్గమన్నారు. జీఎస్టీ, నిత్యావసర ధరల పెంపునకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. వెల్‌లోకి ప్రవేశించి ఆందోళనను మరింత ఉధృతం చేశారు. స్పీకర్ పోడియంను చుట్టుముట్టి నినాదాలు చేశారు. స్పీకర్ ఓ బిర్లా విపక్ష సభ్యులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా..వారు నిరసనలను మానుకోలేదు. దీంతో స్పీకర్ ఓం బిర్లా లోక్‌సభను మధ్యాహ్నం వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ధరల పెరుగుదల, జీఎస్టీపై పార్లమెంట్ దద్దరిల్లుతోంది. ద్రవ్యోల్బణం, గ్యాస్, ఇతర నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై విపక్ష ఎంపీలు ఆందోళన చేస్తున్నారు.ధరల పెరుగుదలకు వ్యతిరేకంగా ప్రతిపక్షాల ఎంపీలు నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. స్పీకర్ ఓం బిర్లా ముఖానికి అడ్డంగా ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. విపక్ష సభ్యులపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. సభా గౌరవాలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి అంశంపై చర్చకు సిద్దమన్నారు. సభ నిబంధనలకు విరుద్ధంగా ప్లకార్డులు ప్రదర్శించడం సరికాదన్నారు. ఈ క్రమంలో సభను వాయిదా వేశారు.

# పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణకు ఇబ్బంది

భద్రాచాలానికి ముంపు ముప్పు పొంచి ఉంది

ఎత్తు తగ్గిస్తేనే వరద ముప్పు ఉండదని వెల్లడి

దీనిపై ఇప్పటికే ఎపికి వివరించామన్న మంత్రి పువ్వాడ



**హైదరాబాద్, జూలై 19 (సమ సమాజం):** పోలవరం ప్రాజెక్టుతో తెలంగాణకు ఇబ్బంది కలుగుతున్న మాట వాస్తవమేనని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. పోలవరం ఎత్తు పెంచితే మరింత ప్రమాదం ఉంటుందన్నారు. దీంతో భద్రాచలానికి ముప్పుగా పరిణ మించిందని అన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనసభ్యులతో కలసి మంగళవారం నాడిక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. పోలవరం వల్ల భద్రాచలానికి ముంపు ముప్పు ఉందని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ఎత్తు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాజెక్టు వల్లే ఇప్పుడు భద్రాచలంలో వరద ప్రవాహం నెమ్మదిగా తగ్గుతోందని చెప్పారు. భద్రాచలంలో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు పువ్వాడ వివరించారు. వరద నుంచి శాశ్వత పరిష్కారానికి వెయ్యి కోట్ల రూపాయలను సీఎం కేసీఆర్ ప్రకటించారని అన్నారు. పోలవరం వల్ల గోదావరి ప్రవాహం స్లోగ వెళ్తోందన్నారు. పోలవరం ఎత్తు తగ్గించాలని గతంలో ఏపీని కోరామని చెప్పారు.సీఎం రోడ్డు మార్గాన వచ్చి వరద బాధితులను కలిశారని అన్నారు. వరద బాధితులను ముంపు ప్రాంతాల నుంచి తరలించి శాశ్వత గృహాలు నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కేంద్రాలను కొనసాగిస్తున్నామని మంత్రి అజయ్ చెప్పారు. పోలవరం ఎత్తు తగ్గించాలని డిమాండ్ చేశారు. పోలవరం పూర్తయితే భద్రాచలం వద్ద 45 అడుగుల వరద ఉంటుందని చెప్పారు. భద్రాచలం ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తున్నట్లు పువ్వాడ తెలిపారు.భద్రాద్రి ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టినట్లు పువ్వాడ వెల్లడించారు. ముంపు వల్ల 840 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిందని వెల్లడించారు. ఇప్పటి వరకు 220 గ్రామాలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు చెప్పారు. బాధిత కుటుంబాలకు 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు పంపిణీ చేశామన్నారు. దాదాపు 72 అడుగుల గోదావరి ప్రవాహం, 25లక్షల క్యూసెక్కుల నీళ్లు వచ్చాయి. పోలవరం ప్రాజెక్టు వల్ల వరద ప్రవాహం నెమ్మదిగా తగ్గుతోంది. పోలవరం ఎత్తు తగ్గించాలని మేము చాలా సార్లు డిమాండ్ చేశాం. భద్రాచలం కరకట్ట ఎత్తు మరింత పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కరకట్ట నిర్మాణం కోసం నిపుణుల బృందం పంపి త్వరలోనే నిర్మాణం చేపడతాం అని సీఎం అన్నారు. వరదల వల్ల 8 సబ్ స్టేషన్లకు ఇబ్బంది కలిగితే అన్నింటిని పునరుద్ధరించాం. 240 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ చేపట్టామని పువ్వాడ అజయ్ తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న ప్రజలందరూ తిరిగి ఇళ్లలోకి వెళ్తున్నారని పువ్వాడ అజయ్ తెలిపారు. వరదల వల్ల 25వేల మందిని పునరావాస కేంద్రాలకు తరలించి నట్లు చెప్పారు. ఇంతటి భారీ వర్షాలకు ఒక్క ప్రాణం పోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నామని వెల్లడించారు. వరదల వల్ల 8 వేల కుటుంబాలు తీవ్రంగా ప్రభావితమైందని చెప్పారు. వరదల వల్ల ప్రభావితమైన కుటుంబాల ఖాతాల్లోకి నేటి నుంచి పరిహారం జమ చేస్తామని పువ్వాడ పేర్కొన్నారు. మీడియా సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ గాంధీ విగ్రహం వద్ద టీఆర్ఎస్ ఆందోళన

## ధరలపై కేంద్రం తీరుపై మండిపడ్డ ఎంపిలు



**న్యూఢిల్లీ, జూలై 19 (సమ సమాజం):** నిత్యావసర వస్తువుల ధరలు అదుపులో లేవని అంటూ టిఆర్ఎస్ ఆందోళనకు దిగింది. ద్రవ్యోల్బణం పెరగడంతో నేపథ్యంలో సామాన్యుడి జీవనం అస్తవ్యస్తమవుతోంది. ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం అవుతున్న నేపథ్యంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర సమితి ఎంపీలు పార్లమెంట్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన ప్రదర్శన చేపట్టారు. లోక్‌సభ, రాజ్యసభకు చెందిన టీఆర్ఎస్ ఎంపీలు గాంధీ విగ్రహం ముందు ప్లకార్డులు ప్రదర్శించి, మోదీ సర్కార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కేశవరావు, నామానాగేశ్వరరావు, సంతోష్, దీపకొండ దామోదర్‌రావులతో పాటు ఇతర ఎంపీలు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. అయితే ధరల పెరుగుదల అంశంపై అంతకుముందు ఉభయసభలు వాయిదా పడ్డాయి. లోక్‌సభ, రాజ్యసభలోనూ విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకువెళ్లి ఆందోళన చేపట్టారు. రెండు సభలూ మద్యాహ్నం 2 వరకు వాయిదాపడ్డాయి.

# భద్రాద్రి జిల్లాలో వరదసహాయక చర్యలు

**అధికారులతో సమీక్షించిన సిఎస్ సోమేశ్ కుమార్**

**గోదావరికి తగ్గుముఖం పట్టిన వరద..**

**ఆలయం చుట్టూ తొలగని బురద**



**హైదరాబాద్/భద్రాద్రికొత్తగూడెం, జూలై 19 (సమ సమాజం):** గోదావరిదలతో అతలాకుతలం అయిన భద్రాద్రి జిల్లాలో సహాయ, పునరావాస చర్యలపై సీఎస్ సోమేశ్‌కుమార్ మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్, ఇతర సీనియర్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మండలానికి ఒక అధికారిని నియమించి సహాయ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతిగ్రామంలో మెడికల్, విద్యుత్, శానిటేషన్ విభాగాల బృందాలను నియమించినట్లు పేర్కొన్నారు. ఇతర జిల్లాల పారిశుధ్య సిబ్బందితో సహాయక చర్యలు చేపట్టామని, ప్రస్తుతం 436 వైద్య శిబిరాల ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయా శిబిరాల్లో ఇప్పటి వరకు పదివేలమందికి పైగా వైద్య చికిత్సలు అందించినట్లు చెప్పారు. గర్భిణులకు పీహెచ్‌సీల్లో వైద్యం అందిస్తున్నామని, ప్రతి పునరావాస కేంద్రంలోనూ వైద్య శిబిరాల ఏర్పాటు చేసినట్లు వివరించారు. అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నట్లు వివరించారు. మరోవైపు భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ప్రస్తుత నీటిమట్టం 54.00 అడుగులకు చేరింది. దాదాపు 14,77,537 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది. మరోవైపు భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. 53 అడుగులలోపు తగ్గగానే మూడో ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరి ంచనున్నారు. గోదావరి వరద ఉగ్రరూపం దాల్చి తిరిగి తగ్గుముఖం పట్టినా రామాలయం పడమర మెట్లు, విస్తా కాంప్లెక్స్, నిత్యాన్నదాన సత్రం, పలు దుకాణాలు ఇంకా గోదావరి వరద నీటలోనే మునిగి ఉన్నాయి. ఉత్తర ద్వార ప్రాంగణం, మిథిలా స్టేడియం వద్ద కూడా ఇంకా వరద నీరు నిలిచిపోయింది. సీఎం కేసీఆర్ రివ్యూలో మందలించినా జిల్లా యంత్రాంగం తీరు మారలేదు. స్పెషల్ అధికారులున్నా రామాలయం పరిసర ప్రాంతాల్లో వరద నీటిని తోడేయడంలో విఫలమయ్యారు. భారీగా వరదవస్తోందని తెలిసినా ముందే సింగరేణి మోటార్లను తెప్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించారు. సీఎం కేసీఆర్ సూచన చేసినా వరద నీరు ఎత్తి పోయడంలో అధికారులు విఫలమయ్యారు.

# కొత్త రికార్డుల్లో మిర్చి ధరలు

## క్వింటా 32వేలను దాటిన వండర్ హాట్ రకం

**వరంగల్, జూలై 19 (సమ సమాజం):** రాష్ట్రంలో మిర్చి ధర కొత్త రికార్డులను సృష్టిస్తోంది. తెలంగాణలోనే పెద్దదైన ఎనుమాముల మార్కెట్లో వండర్ హాట్ రకం క్వింటా 32వేలను దాటింది. ధర బాగున్నందున మిర్చి నిల్వ చేసుకున్న రైతులు అమ్ముకోవాలని మార్కెట్ అధికారులు సూచించారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ మిర్చి రైతులపై కాసుల వర్షం కురిపిస్తోంది. కొన్నాళ్ళుగా మిర్చిధరలు పెరుగుతు న్నట్లు కనిపిస్తున్నా.. మంగళవారం మాత్రం కొత్తపుంతలు తొక్కింది. ఏనుమాముల మార్కెట్లో తాజాగా వండర్ హాట్ రకం ఏకంగా 32వేల 500 గరిష్ట ధర నమోదు చేసింది. యూఎస్- 341 రకం 29వేలు పలికింది. తేజ రకం 23వేల 500 రూపాయలకు చేరింది. గత సీజన్లో శీతల గిడ్డంగుల్లో నిలువ చేసిన మిర్చికి గరిష్ఠ ధరలు దక్కాయని మార్కెట్ కార్యదర్శి రాహుల్ తెలిపారు. ఇదే అనువైన సమయమని... నిల్వ చేసుకున్న రైతులు సరుకు అమ్ముకుంటే మంచి లాభాలు వస్తాయని తెలిపారు. రాబోయే రోజుల్లో ఇంకా పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయన్నారు. వండర్ హాట్ ధర క్వింటాలుకు రూ.32వేల 500కు చేరింది. 1048 రకం మిర్చి రూ.25వేలు పలికింది. తేజ రకం రూ.23,500. ఈ రకాల మిర్చి మంచి ధర పలుకుతోంది. నిల్వ చేసుకున్న రైతులు అమ్ముకునేందుకు ఇది సరైన సమయం అన్నారు.

# వ్యవసాయం తరవాత గొర్రెల పెంపకానికి ప్రాధాన్యం

## వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి




**వనపర్తి, జూలై 19 (సమ సమాజం):** వ్యవసాయం తర్వాత గొర్రెల పెంపకానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నదని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. అందుకే సబ్సిడీపై గొర్రెల యూనిట్లు మంజూరు చేస్తున్నామనిఅన్నారు. మంగళవారం పెబ్బేరులో ఉచిత నీలి నాలుక వ్యాధి వ్యాక్సినేషన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడాదికి నాలుగు సార్లు ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. ఒక్క పెబ్బేరు గ్రామంలో 6 వేల సబ్సిడీ గొర్రెలకు గాను రూ.2.5 కోట్లు ఖర్చు చేశామన్నారు. నాలుగు లక్షల గొర్రెలకు ఉచిత మందులు పంపిణీ చేశామని మంత్రి వెల్లడించారు. అంతకుముందు వనపర్తిలో 80 మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్దిదారులకు రూ.33 లక్షల 64 వేల విలువైన చెక్కులు, 11 మంది కులాంతర వివాహం చేసుకున్న జంటలకు రూ.2.5 లక్షల విలువైన చెక్కులను అందజేశారు కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఉన్నారు.

# దేశానికి ఆదర్శంగా తెలంగాణ

## విద్యారంగంలో దూసుకపోతోంది



**మేడ్చెల్, జూలై 19 (సమ సమాజం):** తెలంగాణ సర్కారు గురుకులాలు, మైనారిటీ రెసిడెన్సీ పాఠశాలలు ఏర్పాటు చేసి దేశంలోనే విద్యారంగానికి ఆదర్శంగా నిలుస్తుందని కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు కార్పొరేట్ వసతులు కల్పిస్తూ.. సీఎం కేసీఆర్ విద్యారంగానికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఎ.వి. కన్‌స్ట్రక్షన్ సౌజన్యంతో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ చేసే కార్యక్రమానికి మంత్రి మల్లారెడ్డి హాజరై విద్యార్థు లకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు మెరుగైన సదుపాయాల కల్పనతో పాటు నాణ్యమైన విద్యనందించడానికి ప్రభుత్వం సుమారు రూ. 7289 కోట్లతో మన ఊరు-మనబడి, మన బస్తీ-మనబడి కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల శ్రద్ధ చూపిస్తున్న పీర్జాదిగూడ కార్పొరేషన్ పాలక వర్గాన్ని మంత్రి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కాటెపల్లి జనార్ధన్‌రెడ్డి, మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, డీఈవో విజయకుమారి, డిప్యూటీ మేయర్ శివకుమార్‌గౌడ్, కమిషనర్ రామకృష్ణారావు, కార్పొరేటర్లు హరిశంకర్ రెడ్డి, అనంతరెడ్డి, సుభాష్ నాయక్, బచ్చరాజు, నాయకులు అంజిరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, రవీందర్, సతీష్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు

# వివిధ ప్రాంతాలకు ప్రత్యేక రైళ్లు

## దక్షిణమధ్య రైల్వే వెల్లడి

**హైదరాబాద్, జూలై 19 (సమ సమాజం):** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో వివిధ ప్రాంతాలకు ఆగస్టు 1 నుంచి ప్రత్యేక రైళ్లను నడపనుంది. ప్రాయణికుల రద్దీ దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. హైదరాబాద్-తిరుపతి, తిరుపతి-హైదరాబాద్, కాచిగూడ-నర్సాపూర్, నర్సాపూర్-తిరుపతి, తిరుపతి-కాచిగూడ మధ్య ఈ ప్రత్యేక రైళ్లను నడపనున్నారు. హైదరాబాద్-తిరుపతి మధ్య ఆగస్ట్ 1,8,15,22,29 తేదీల్లో ప్రత్యేక రైళ్లు, తిరుపతి-హైదరాబాద్ మధ్య ఆగస్ట్ 2,9,16,23,30 తేదీల్లో ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. కాచిగూడ-నర్సాపూర్ మధ్య ఆగస్ట్ 1,8,15,22,29 తేదీల్లో, నర్సాపూర్-తిరుపతి మధ్య ఆగస్ట్ 2,9,16,23,30 తేదీల్లో ప్రత్యేక రైళ్లు తిరుగుతాయి. తిరుపతి-కాచిగూడ మధ్య ఆగస్ట్ 3,10,17,24,31 తేదీల్లో ప్రత్యేక రైళ్లు తిరుగనున్నాయి.

# హుస్నాబాద్‌లో అధికార టీఆర్ఎస్‌కు షాక్

- మాజీ ఎమ్మెల్యే అలిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరిక
- విపక్షనేత మల్లికార్జున ఖర్గే సమక్షంలో పార్టీలో చేరిక
- వరదలనుంచి ప్రజలను ఆదుకోవడంలో కసిఆర్ విఫలం
- క్లౌడ్ బరస్ట్ వ్యాఖ్యలపై మరోమారు మండిపడ్డ రేవంత్



**న్యూఢిల్లీ, జూలై 19 (సమ సమాజం):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో అధికార పార్టీ టీఆర్ఎస్‌కు షాక్ తగిలింది. టీఆర్ఎస్ పార్టీకి మాజీ ఎమ్మెల్యే అలిరెడ్డి ప్రవీణ్ రెడ్డి రాజీనామా చేసి కాంగ్రెస్ గూటికి చేరారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నాయకుడు మల్లిఖార్జునఖర్గే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి, షబ్బీర్ అలీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచుకున్నారు. ఇప్పుడిప్పుడే కాంగ్రెస్‌లో వలసలు జోరుగా కొనసాగుతున్నాయి. ఎలాగై ఈసారి ఎలక్షన్‌లో కాంగ్రెస్ గెలవాలని పట్టుదలతో ఉంది. అందుకు తగట్లుగానే పార్టీ నేతలతో పాటు కార్యకర్తలు కూడా ప్రతి కార్యక్రమాల్లో చురుక్కుగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ పై టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి మండిపడ్డారు. వరదలొచ్చి జనం ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి జాతీయ రాజకీయాల్లోకి ఎంట్రీ గురించి ఆలోచిస్తున్నారని విమర్శించారు. ప్రజలను ఆదుకోవాల్సిన సమయంలో రాజకీయ ఆరోపణలతో కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి క్లౌడ్ బరస్ట్ కామెంట్లు అత్యంత నిర్లక్ష్యమైనవన్న రేవంత్.. అవినీతిపై చర్చ జరగకుండా ఈ అంశాన్ని తెరపైకి తెచ్చారని అన్నారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి సీనియర్ నేత మల్లిఖార్జున ఖర్చే సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రేవంత్.. ప్రవీణ్ రెడ్డి రాకతో హుస్నాబాద్ లో కాంగ్రెస్ మరింత బలోపేతమవుతుందని అన్నారు. క్లౌడ్ బరస్ట్ ముందు విదేశాల కుట్ర అన్న కేసీఆర్ ఇప్పుడు పక్క రాష్ట్రాల కుట్ర అంటున్నారని రేవంత్ రెడ్డి విమర్శించారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కు చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీకి వచ్చి కేంద్రానికి వరద నష్టం నివేదిక సమర్పించి రూ.2వేల కోట్ల నిధులు సాధించుకోవాలని అన్నారు. భారీ వర్షాల కారణంగా ఇంత నష్టం జరిగినా కేంద్రం ఇప్పటి వరకు పరిశీలక బృందాలను రాష్ట్రానికి పంపలేదని రేవంత్ ఆరోపించారు. రాష్ట్రంలో 21 నుంచి బీజేపీ చేపట్టనున్న ర్యాలీలను ప్రజలు అడ్డుకోవాలని సూచించారు. తెలంగాణ ప్రజల ప్రాణాలంటే బీజేపీకి విలువలేదని, ఆ పార్టీని గెలిపిస్తే రాష్ట్రం మరింత ప్రమాదంలో పడుతుందని రేవంత్ అభిప్రాయపడ్డారు. పోలవరంపై కేసీఆర్, పువ్వాడ అజయ్ వ్యాఖ్యల్లో ఎవరి కామెంట్లు నమ్మాలని రేవంత్ ప్రశ్నించారు. ఆ ఆరోపణలు నిజమైతే ఇన్ని రోజులు ఎందుకు అభ్యంతరం లేవనెత్తలేదని అన్నారు. పోలవరాన్ని సాంకేతికంగా పరిశీలించాలన్న రేవంత్.. టీఆర్ఎస్ నేతలు సమస్యల్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

# ముంపు నుంచి ప్రజలను త్వరగా బయట పడేయాలి

**పంచాయితీ అధికారులతో మంత్రి ఎర్రబెల్లి సమీక్ష**



**హైదరాబాద్, జులై 19 (సమ సమాజం)** వరదప్రాంతాల్లో దెబ్బతిన్న ఆవాసాల వారికి తక్షణ సాయం అందించి, వారిని వరదల నుంచి బయటపడేయాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. అవసరమైన చర్యలు వెంట వెంట తీసుకోవాలని, ప్రజలను ముంపు పరిస్థితుల నుంచి సాధ్యమైనంత వేగంగా బయట పడేయాలన్నారు. బాధితులకు అందుబాటులో ఉండాలని, సహాయక చర్యల్లో రాజీ పడొద్దని మంత్రి అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెలంగాణ అతలాకుతల మైంది. భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం సహాయక చర్యలను ముమ్మరం చేసింది. తెలంగాణ ప్రభుత్వం వరద బాధితులకు అండగా నిలుస్తున్నది. నిన్న మొన్నటి వరకు స్వయంగా సీఎం కేసీఆర్, మంత్రులు ఎర్రబెల్లి, హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ వరద ముంపు ప్రాంతాలను పర్యటించారు. ఏరియల్ సర్వే చేశారు. అధికారులతో సమీక్షలు జరిపి తీసుకోవాల్సిన చర్యలను ఆదేశించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హైదరాబాద్ కు వచ్చిన వెంటనే పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షించారు. మంత్రుల నివాసంలో వరద ముంపు ప్రాంతాల పరిస్థితులను, తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. ఇటీవల వర్షాలకు అతలాకుతలమైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ ఎత్తున పంచాయతీరాజ్ అధికారులను సహాయక చర్యల కోసం నియమించారు. అలాగే ఫాగింగ్ వంటి యంత్రాలను పంపించారు. జిల్లాలో తీవ్రంగా నష్టపోయిన గ్రామ పంచాయతీలు 45, ఆవాసాలు 96, ఉన్నట్లుగా మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. వర్షాలకు బాగా నష్టపోయిన బూర్గంపాడు, సారపాక, భద్రాచలం, చర్ల, దుమ్ముగూడెం గ్రామాల తాజా పరిస్థితిపై మంత్రి ఆరా తీశారు. ఆయా గ్రామాలకు ఇప్పటికే 5 డీపీఓలను, 21 మంది ఎంపీఓలను, 219 మంది పంచాయతీ కార్యదర్శులను, 4,100 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించాం. అలాగే 9 ఫాగింగ్ మిషన్లు, 60 చేతి ఫాగింగ్ మిషన్లు, 90 స్ప్రేయర్లు, 12 టిప్పర్లు, 170 ట్రాక్టర్లు, ట్రాలీలు, 4 బాబ్ క్యాట్స్, 12 జేసీబీలను ఏర్పాటు చేశామన్నారు.

# తాళం పగులగొట్టి చోరి



**నర్సాపూర్, జులై 19 (సమ సమాజం):** మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట్ గ్రామంలో గుర్తుతెలియని దొంగలు శివగోని యాదగిరి గౌడ్ ఇంట్లో చోరీ చేశారు. యాదగిరి గౌడ్ సెక్యూరిటీ గార్డ్ గా పనులు చేయుచున్నాడు. అయితే భార్య పిల్లలు బోనాల పండుగకు కొక్కొండ గ్రామానికి తేదీ 16. 07. 2022 రోజున మధ్యాహ్నం వెళ్ళినారు. 17. 07. 2022 ఇంటికి తాళం వేసి విధులు నిర్వర్తించడం కోసం యాదగిరి గౌడ్ డ్యూటీ కి వెళ్ళాడు. తిరిగి మరునాడు ఉదయం 7. గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చేసరికి తాళం పగులగొట్టబడియున్నది అని ఆయన పేర్కొన్నారు. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువా పగులగొట్టబడి ఉన్నదని మరియు బీరువాలో దాచిన 20 తులాల వెండి పట్టగొలుసులు, తులం బంగారం కమ్మలు, బుట్టాలు, 20000 నగదు రూపాయలను దోచుకెళ్లినారని తెలిపారు. అదే విధంగా పిట్ల చంద్రం, పిట్ల మల్లమ్మ ఇండ్ల తాళాలు పగలగొట్టినారు కానీ వస్తువులేమి పోలేదని తెలిసినది అన్నారు. తక్షణమే పోలీస్ సిబ్బంది చట్ట రీత్యా చర్యలు చేపట్టి మాకు న్యాయం చేయగలరని మనోహరాబాద్ పిఎస్ లో సోమవారం ఫిర్యాదు చేయడం జరిగింది. తూప్రాన్ సిఐ. శ్రీధర్, మనోహరాబాద్ ఎస్సై ఎల్. రాజు ఘటనా స్థలికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు

# అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్న అందోల్



**అందోల్, జులై 19 (సమ సమాజం)** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం హయాంలో పట్టణాలు, పల్లెలు అభివృద్ధి పథంలో పరుగులు పెడుతున్నాయని సంగారెడ్డి జిల్లా అందోల్ - జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్, గూడెం మల్లయ్య, అన్నారు. మంగళవారం నాడు మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో సి సి రోడ్డు, అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ హయాంలో పట్టణ రూపు రేఖలు మారుతున్నాయని అన్నారు. వార్డులో పలు పనులకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు మున్సిపల్ చైర్మన్ , కౌన్సిలర్, గాజుల ధనలక్ష్మి, అనిల్ కుమార్, ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చందర్, అర్పత్ మోయొద్దిన్, వర్క్ ఇన్స్పెక్టర్ రఫిక్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు

# సాధారణ ప్రసవాలకే ప్రాధాన్యం ఇవ్వాలి


**సిజేరియన్లతో ఆరోగ్య సమస్యలు తప్పవు**

**సంగారెడ్డిలో అభివృద్ధి పనులకు మంత్రి హరీష్ శ్రీకారం**



**సంగారెడ్డి, జులై 19 (సమ సమాజం)** సాధారణ ప్రసవాలకే మహిళలు ముందుకు రావాలని వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సూచించారు. సిజేరియన్లతో ఆరోగ్యం దెబ్బతీసుకోవద్దని సూచించారు. సంగారెడ్డి పట్టణ కేంద్రంలో రూ.50 కోట్ల నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేశారు. బీసీ బాలికల కాలేజీ హాస్టల్ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. సైన్స్ మ్యూజియాన్ని సందర్శించారు. సంగారెడ్డి మున్సిపల్ కాంప్లెక్స్‌ను, చింతలపల్లిలో బస్తీ దవఖానాను ప్రారంభించారు. రూ. 15 కోట్లతో నిర్మించిన రెండు వాటర్ ట్యాంక్‌లను కూడా మంత్రి హరీశ్‌రావు ప్రారంభించి, ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. జిల్లాకు వచ్చిన స్పేస్ ఆన్ వీల్స్ బస్సును మంత్రి సందర్శించి, ఇస్రో శాస్త్రవేత్తలతో పలు అంశాలపై చర్చించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన అనంతరం మంత్రి హరీశ్‌రావు ప్రసంగించారు. సంగారెడ్డి పట్టణంలో రూ. 50 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడం సంతోషంగా ఉందన్నారు. సంగారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా రూ. 50 కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. టెండర్లు పిలిచి త్వరగా పనులు మొదలు పెట్టాలని సూచించారు. రూ. 15 కోట్లతో తాగునీరు కోసం 4 వాటర్ ట్యాంక్‌లు నిర్మించి ఇంటింటికి తాగునీరు ఇచ్చే పథకం ప్రారంభం చేశామని తెలిపారు. ఇక సంగారెడ్డి మున్సిపాలిటీలో తాగునీటి సమస్య ఉండదన్నారు. రూ. 500 కోట్లతో 650 పడకల సామర్థ్యంతో మెడికల్ కాలేజీ నిర్మాణం జరుగుతుందన్నారు. త్వరలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కాలేజ్ ప్రారంభం జరుగుతుందన్నారు. సంగారెడ్డిలో కొత్తగా మరిన్ని బస్తీ దవఖానాలు ప్రారంభిస్తామని మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ మధ్య గర్భిణులు సిజేరియన్లకు డిమాండ్ చేస్తున్నారని అన్నారు. ఇది వాంఛనీయం కాదన్నారు. దీనిని నివారించేందుకు ముందుకు రావాలన్నారు.

# చలన చిత్రం




## సీతారామశాస్త్రి చివరిపాట ఏదీ!



గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి మరణించిన తర్వాత 'ఆయన రాసిన చివరి పాట మా సినిమాకే' అంటూ చాలామంది ప్రచారం చేసుకున్నారు. ఇటీవల శ్యామ్ సింగరాయ్ చిత్రంలోనూ ఇలానే వాదనలు వచ్చాయి. కానీ తాజాగా ఇప్పుడు సీతారమం, రంగమార్తాండ లోనూ ఆయన పాటలు ఉన్నాయి. ఎస్.పి.బాలు మరణించిన సమయంలోనూ ఇదే జరిగింది. బాలూగారు చివరి పాట మా సినిమాలోనే పాడారు' అని చాలామంది చెప్పుకొచ్చారు. చివరి పాట ఒకటే ఉంటుంది కానీ.. చివరి పాటలు ఉండవు. బాలు, సీతారామశాస్త్రి విషయంలో 'ఇదే చివరి పాట' అంటూ చాలా పాటలొచ్చాయి. ఇదంతా కరోనా వల్ల షూటింగ్‌లు ఆలస్యం అయ్యి.. సమయానికి రిలీజ్ కాక ఎప్పుడో రాసిన పాటలు ఇప్పుడు రిలీజ్ కావడం వల్ల వచ్చిన సమస్యగా తేలింది. సీతారామశాస్త్రి 'రంగమార్తండ'లో ఓ పాట రాశారు. 'సీతారామం'లోనూ ఆయన రాసిన పాట ఇటీవల బయటకు వచ్చింది. అయితే ఈ చిత్రాలు ఆ విషయాన్ని బయటకు చెప్పుకోలేదు. అయితే సిరివెన్నెల చివరిగా రాసిన పాట ఎవరి కోసమో తెలిస్తే..ఆశ్చర్యపోవాల్సిందే. సిరివెన్నెల తన చివరి పాట సినిమా కోసం కాకుండా తన అర్ధాంగి పద్మావతి కోసం రాశారు. ఆసుపత్రి బెడ్ మీద ఉన్న సిరివెన్నెల తన భార్యకు కానుకగా ఓ పాట రాశారని, ఆ పాటలోని పల్లవి మాత్రమే పూర్తయ్యిందని ఆయనకు అత్యంత సన్నిహితులైన ఒకరు వెల్లడించారు. అయితే సీతారామశాస్త్రి చివరిపాట ఇదే అని అధికారం ఆయన భార్యకు మాత్రమే ఉందన్నమాట.

## మహేశ్ పోకిరికి ఆధునిక సాంకేతికత జోడింపు

### రీ రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్న మేకర్స్

మహేష్ 'పోకిరి' విడుదలై దాదాపు పదహారేళ్లు పూర్తయింది. అయినా ఇప్పటికీ ఈ మూవీ బుల్లితెర టీఆర్పీల్లో వెనకబడలేదు. అయితే ఈ సినిమాని నేటి అధునాతన డిజిటల్ సాంకేతికతను జోడించి రీ రిలీజ్ చేస్తే ఎలా ఉంటుంది? .. ఇదే ఆలోచన మేకర్స్ కి వచ్చింది. ఇప్పుడు ఈ మూవీని 4ఐ రిజొల్యూషన్ లోకి రీ మాస్టర్ చేసి డాల్బీ ఆడియోతో థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఆగస్ట్ 9న మహేష్ పుట్టినరోజు సందర్భంగా ఇరు తెలుగు రాష్ట్రాల్లో భారీ ప్రీమియర్లు వేయనున్నారని తెలిసింది. ప్రతిసారీ తన పుట్టినరోజున ఫ్యాన్స్ కి ఏదో ఒక కొత్త విషయం అందించే మహేష్ ఈసారి స్పెషల్ గిఫ్ట్ ని ప్లాన్ చేసారని కూడా దీనిని బట్టి అర్థమవుతోంది. డిజిటల్ మాస్టరింగ్ అయ్యాక పోకిరిని భారీ ప్రీమియర్లుగా రిలీజ్ చేయడం ఆసక్తిని కలిగిస్తోంది. గతంలో బిజినెస్ మెన్- శ్రీమంతుడు లాంటి సినిమాల్ని రీరిలీజ్ చేయగా అభిమానులు ఎంతో ఖుషీ అయ్యారు. పోకిరితో మరోసారి అలాంటి మ్యాజిక్ రిపీట్ కానుంది. మహేష్ కెరీర్ లోనే పోకిరి రికార్డ్ బ్రేకింగ్ హిట్. ప్రిన్స్ మహేష్ ని సూపర్ స్టార్ ని చేసిన చిత్రమిది. 16 ఏళ్ల క్రితం 2006 ఏప్రిల్ 28న ఈ సినిమా విడుదలైంది. ఈ చిత్రం అప్పటి వరకు తెలుగు చిత్ర పరిశ్రమలో ఉన్న అన్ని రికార్డులను తిరగరాసింది. పోకిరి చిత్రంతో మహేష్ .. ఇలియానా లాంటి స్టార్ల రేంజే మారిపోయింది. ముఖ్యంగా మహేష్ ని రొటీన్ పాత్రల నుంచి బయటపడేసిన చిత్రమిది. ఈ మూవీకి పూరి రాసిన డైలాగులు ఎప్పటికీ ఇండస్ట్రీ ట్రెండ్ ం సెట్టర్స్. ఇలియానా అందచందాలు.. బ్రహ్మానందం కామెడీ.. యాక్షన్ సీక్వెన్స్ హైలైట్స్ గా నిలిచి సక్సెస్ లో కీలక భూమికను పోషించాయి.

## పాన్ ఇండియా లెవల్లో గూఢచారి-2 సీక్వెల్



ప్రస్తుతం 'పాన్ ఇండియా' ట్రెండ్ నడుస్తోంది. అగ్ర హీరోలకు ధీటుగా ఇటీవల యువహీరోల ఆలోచనలు సాగుతున్నాయి. ఇదే కోవలో ట్యాలెంటెడ్ హీరో కం రైటర్ అడివి శేష్ భారీ 'పాన్ ఇండియా' ప్రణాళికలతో దూసుకెళుతున్నాడు. ఇటీవలే 'మేజర్' చిత్రంతో పాన్ ఇండియా హిట్ కొట్టిన శేష్ మరోసారి అలాంటి మ్యాజిక్ ని రిపీట్ చేయాలని ఆలోచిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుతం అతడు పాన్ ఇండియా స్క్రిప్ట్ లపై దృష్టి సారించాడు. మేజర్ తరహాలో హిందీ-తెలుగు పరిశ్రమలతో పాటు ఇతర ప్రాంతీయ భాషల్లోనూ మెప్పించే స్క్రిప్టులను సిద్ధం చేయాలని భావిస్తున్నారు. మారిన ఇమేజ్ తో ఇకపై ప్రతిసారీ ఇరుగు పొరుగున ఆడియెన్ ని అతడు దృష్టిలో పెట్టుకోనున్నాడు. అదే క్రమంలో అతడు తన బ్లాక్ బస్టర్ 'గూఢచారి' సీక్వెల్ పైనా దృష్టి సారించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. స్పై ఆపరేషన్ నేపథ్యంలో ఏ సినిమా తీసినా అది యూనివర్స్ కి కనెక్టయ్యి ఉంటుంది. ప్రస్తుతం ఈ తరహా సినిమాల ట్రెండ్ జోరందుకుంది. ఇదే ఒరవడిలో శేష్ మరో పాన్ ఇండియా స్క్రిప్టునే ఎంపిక చేసుకుంటారని సమాచారం. గూఢచర్యం నేపథ్యంలో సత్తా చాటాలని కూడా అతడు గట్టిగా నిర్ణయించుకున్నట్టు గుసగుస వినిపిస్తోంది. గూఢచారి ఫ్రాంఛైజీకి చాలా మైలేజ్ ఉంది. దానిని కొనసాగిస్తాడని కూడా టాక్ వినిపిస్తోంది. ఈ చిత్రం కొత్త విడుదల తేదీని త్వరలో ప్రకటించనున్నారు. హిట్ 2 ఒక యాక్షన్ థ్రిల్లర్. ఈ చిత్రానికి శైలేష్ కొలను దర్శకత్వం వహించారు. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటించింది. వాల్ పోస్టర్ సినిమా ఫ్రాంచైజీ ఈ మూవీని నిర్మించింది. ఈ మూవీ నాన్-థియేట్రికల్ బిజినెస్ జోరుగా సాగిందని టాక్ ఉంది.

## పరిచయం లేకున్నా ఎందుకనో జలసీ ట్రోలర్లకు ఘాటుగా సమాధానమిచ్చిన సుస్మిత



కొన్నిరోజులుగా లలిత్ మోదీ-సుస్మితాసేన్ అజరామార ప్రేమ వ్యవహారం హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. 46 ఏళ్ల సుస్మిత తనకన్నా 12 ఏళ్లు వయసులో పెద్దవాడైన లలిత్ మోదీని ప్రేమించడంపై ఎవరికి వారు భిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంలో ప్రధానంగా సుస్మితాసేన్ ట్రోలర్లకి టా÷-గ్గ÷ట్ అయింది.పాత ప్రేమ కథలు...బ్రేకప్ స్టోరీలు బయటకు తీసి మరి విమర్శలు గుప్పిస్తున్నారు. కొత్తగా లలిత్‌తో ప్రేమ కహాని కేవలం డబ్బు కోసమనేనని....సర్వ సుఖాలు డబ్బుతో ముడిపడినవి కాబట్టే వయసులో పెద్దోడ్ని తగులుకుందని కామెంట్లు సహా ట్రోలింగ్ చేస్తున్నారు. సుస్మితని 'గోల్డ్ డిగ్గర్' అంటూ కామెంట్లు చేసారు.'సుస్మితా సేన్ లో ప్రేమను కనిపెట్టా' అంటూ లలిత్ మోదీ ఇన్ స్టాలో చెప్పడం మరింత సంచలనమవుతుంది. ఆ పాయింట్ పై ట్రోలర్ల దాడి మామూలుగా లేదు. ఈ అంశంపై రకరకాల కామెంట్లు..వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. తాజాగా ఈ విమర్శలకి..ట్రోలర్ల కి సుస్మితాసేన్ ధీటైన సమాధానం ఇచ్చింది.'చుట్టూ ఉన్న ప్రపంచం దయనీయంగా మారుతుంది. అది చూస్తుంటే చాలా బాధగా ఉంది. కొంత మంది మేధావులు..గాసిప్స్ క్రియేట్ చేసేవారు.. అమాయకులు.. నన్ను కలవని స్నేహితులు.. పెద్దగా పరిచయం లేని వ్యక్తులు ఇలా అంతా ఒకేసారి నా వ్యక్తిత్వంపై అమూల్యమైన అభిప్రాయాలు చెప్పుకొస్తున్నారు. నన్నొక గోల్డ్ డిగ్గర్ అంటున్నారు. డబ్బు కోసమే ఇవన్నీ చేస్తున్నారం టున్నారు. నాకు బంగారం కంటే వజ్రాలంటేనే ఎక్కువ ఇష్టం. దయచేసి అంతా ఒక విషయం తెలుసుకోండి. ఎందుకంటే తాత్కాలికమైన మెప్పుకోసం నేను జీవించను' అని చెప్పుకొచ్చింది. ఈ పోస్ట్ కి పలవురు సెలబ్రిటీలు కామెంట్లు చేసారు. ఇందులో ప్రియాంక చోప్రా..సునీల్ శెట్టి కనిపిస్తున్నారు. టాలీవుడ్ నుంచి మంచు లక్ష్మి సుస్మితా సేన్ పోస్ట్ కి లైక్ కొట్టారు. సుస్మితాసేన్- లలిత్ మోదీల ప్రేమ వ్యక్తిగతం అయినా పబ్లిక్ ప్లాట్ ఫాంలోకి వచ్చి విషయాన్ని రివీల్ చేస్తే సీన్ ఇలాగే ఉంటుంది. అందరూ ఒకేలా ఆలోచించలేరు. ఎవరి సామర్థ్యం మేర వారు ఆలోచిస్తారు. ఆ రకంగానే స్పందిస్తారు.

## శ్రావణభార్గవి అన్నమయ్య కీర్తన వివాదం చేసే యత్నం



టాలీవుడ్ గాయని శ్రావణ భార్గవి అన్నమయ్య కీర్తనతో ఓ ఆల్బమ్ చేసి యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేశారు. అయితే కొందరు దీనిని వివాదం చేసే యత్రం చేస్తున్నారు. ఆమె సరదాగా ఆడుతూ పాడుతూ చేసిన ఈ ఆల్బమ్‌పై కొందరు వివాదం చేసే యత్నం చేసారు. దీనికి ఆమెను ముగ్గులోకి లాగగా తాను ఎక్కడా పొరపాటు చేయలేదని, ఎక్కడా శృతి తప్పలేదని తెలిపింది. అన్నమయ్యను అవమానించారంటూ ఆయన కుటుంబ సభ్యులతో అడిగించే యత్నం చేశారు. తాజాగా ఆమె అన్నమాచార్యులు రచించిన 'ఒకపరి ఒకపరి వయ్యారమే' పాటను ఒక ఫ్యూజన్‌గా చిత్రీకరించారు. అన్నమయ్య కుటుంబీకులు దీనిపై స్పందిస్తూ 'అన్నమాచార్యుల పాటను అసభ్యంగా జంతికలు తింటూ చిత్రీకరించి ఆయన్ను అవమా నించారని ఆక్షేపించారు. అభిషేకం వేళ వెంకటేశ్వరస్వామిని స్మరిస్తూ, భక్తి పారవశ్యంలో మునిగి తేలిన అనుభూతి కలిగేలా అన్నమయ్య రాసిన ఈ పాటను శ్రావణ భార్గవి ఇలా రూపొందించారెందుకని ప్రశ్నించారు. అన్నమాచార్యుల పెద్దకుమారులు పెదతిరుమలాచార్యులు సాక్ష్యాత్తూ స్వామివారికి అభిషేక కైంకర్యం చేస్తూ కీర్తించిన పాటను ఆమె కాళ్లు ఊపుతూ, వివిధ భంగిమల్లో కనిపిస్తూ చిత్రీకరించడం చాలా బాధగా ఉంది. ఆమె అందాన్ని వర్ణించడానికి ఆ కీర్తనను అలా ఉపయోగించడం పొరపాటని అన్నమయ్య కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకపరి ఒకపరి వయ్యారమే అన్న శృంగార కీర్తనను మేం ఎందుకు చేయకూడదని ఆమె ప్రశ్నించారు. తాను చేసిన వీడియోలో ఎక్కడా అశ్లీలత జోడించలేదని వివరణ ఇచ్చింది.




## సీతారామంలో ఆకట్టుకుంటున్న కానున్న కళ్యాణం పాట

తెలుగు తమిళం మలయాళం భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న 'సీతారామం' చిత్రాన్ని ఆగస్ట్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జోరుగా ప్రమోషన్స్ చేస్తున్నారు. ఇప్పటికే వచ్చిన ప్రమోషనల్ కంటెంట్ మంచి రెస్పాన్స్ తెచ్చుకోగా.. లేటెస్టుగా థర్డ్ సింగిల్ ను లాంచ్ చేశారు. 'కానున్న కళ్యాణం' అనే ఈ పాటని హైదరాబాద్ మల్లారెడ్డి ఉమెన్స్ కాలేజీలో జరిగిన ఈవెంట్ లో గ్రాండ్ గా విడుదల చేశారు. దుల్కర్ సల్మాన్ – మృణాల్ ఠాకూర్ మరియు ఈ సినిమాలో కీలక పాత్ర పోషించిన దర్శకుడు తరుణ్ భాస్కర్ ఈ వేడుకలో పాల్గొన్నారు. ఈ పాటకు వేదికపై దుల్కర్ – మృణాల్ జంట డ్యాన్స్ చేసి ప్రేక్షకులని అలరించారు. 'కానున్న కల్యాణం ఏమన్నది?.. స్వయవరం మనోహరం.. రానున్న వైభోగం ఎటువంటిది?.. ప్రతీ క్షణం మనోహరం..' అంటూ సాగిన ఈ క్లాస్ నంబర్ శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది. విశాల్ చంద్రశేఖర్ స్వరపరిచిన ఈ పాట హృదయానికి హత్తుకుంటోంది. అనురాగ్ కులకర్ణి మరియు సిందూరి ఈ పాటని అద్భుతంగా ఆలపించారు. దివంగత గేయ రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి ఈ పాటకు అర్థవంతమైన సాహిత్యం అందించారు. మంచి లోకేషన్స్ లో చిత్రీకరించిన ఈ పాట చాలా ఆహ్లాదకరంగా వుంది. దుల్కర్ – మృణాల్ మధ్య కెమిస్ట్రీ బాగా కుదిరింది. పీఎస్ వినోద్ సినిమాటోగ్రఫీ ప్రశంసనీయం. 'కానున్న కళ్యాణం' సాంగ్ లాంచ్ ఈవెంట్ లో దుల్కర్ సల్మాన్ మాట్లాడుతూ.. ఇలాంటి అందమైన పాట చేయడం నా కెరీర్ లో ఇదే మొదటిసారి. కాశ్మీర్ మంచు – ట్రెడిషనల్ దుస్తులలో చాలా అందంగా చిత్రీకరించాం. మోస్ట్ రొమాంటిక్ విజువల్ వండర్ లాంటి సాంగ్ ఇది. ఇది నా ఫేవరేట్ సాంగ్. ఈ పాటని మీ సమక్షంలో విడుదల చేయడం ఆనందంగా వుంది. ఇంతమంది విద్యార్థులని ఒక్క చోట చూడటం ఇదే మొదటిసారి. ఆగస్ట్ 5న అందరం థియేటర్ లో కలుద్దాం అని అన్నారు మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ.. 'సీతా రామం' బ్యూటీఫుల్ లవ్ స్టోరీ. 'కానున్న కళ్యాణం' నాకు ఎంతో ఇష్టమైన పాట. ఈ పాటని చాలా గ్రాండ్ గా షూట్ చేశాం. సినిమా అద్భుతంగా వుంటుంది. ఆగస్ట్ 5న అందరూ థియేటర్ లో సినిమా చూడాలి అని కోరారు. తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ.. 'ఈ సినిమాలో చాలా ఆసక్తికరమైన పాత్ర చేస్తున్నా. దర్శకుడు హను కాల్ చేసి.. సీతారామా మధ్యలో నీవు హనుమంతుడివని చెప్పారు. ఆయన ఒకసారి కథ చెప్పిన తర్వాత మరో ఆలోచన లేకుండా ఈ సినిమా చేస్తున్నాని చెప్పా. హను అద్భుతమైన దర్శకుడు. సీతారామం అందమైన ప్రేమకథ. ఈ మధ్య కాలంలో ఇలాంటి ప్రేమ కథ చూడలేదు' అని అన్నారు.

## సీతారామం స్ట్రీమింగ్ పార్ట్‌నర్‌గా అమెజాన్

### హక్కులు దక్కించుకున్నట్లు ప్రచారం



యంగ్ సూపర్ స్టార్ దుల్ఖర్ సల్మాన్ తెలుగులో డైరెక్ట్‌గా నటిస్తున్న రెండో చిత్రం 'సీతారామం' హను రాఘవపూడి దర్శకత్వంలో, వైజయంతి మూవీస్ సమర్పణలో, స్వప్న సినిమాస్ బ్యానర్‌పై ఈ సినిమా నిర్మాణం జరుపుకుంటోంది. ఇందులో దుల్ఖర్ లెఫ్టినెంట్ రామ్‌గానూ, మృణాల్ ఠాకూర్ సీతగానూ నటిస్తున్నారు. అందాల రష్మికా మందణ్ణ కాశ్మీరీ ముస్లీమ్ అమ్మాయి అఫ్రీన్‌గా కీలక పాత్రలో నటిస్తోంది.' యుద్ధంతో రాసిన ప్రేమకథ' ట్యాగ్ లైన్ తో ఆసక్తికరమైన కథాకథనాలతో చిత్రం రూపొందుతోంది. ఒక అందమైన యువతితో యుద్ధానికి సిద్ధంగా ఉన్న ఒక సైనికుడు ప్రేమలో పడితే వారి బంధం ఎలాంటి పరిస్థితులకు దారితీస్తుంది అన్నదే ఈ సినిమా ప్రధాన కథాంశం. ఈ అందమైన పీరియాడికల్ లవ్‌స్టోరీకి విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. 'సీతారామం' చిత్రం ఆగస్ట్ 5న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కాబోతోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్, సింగిల్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. త్వరలోనే ట్రైలర్ విడుదల కానుంది. ఇక ఈ సినిమా స్ట్రీమింగ్ పార్టనర్ ఎవరన్న విషయంలో ఒక వార్త వినిపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం 'సీతారామం' చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ పూర్తయిన తర్వాత అగ్రిమెంట్‌లో సూచించిన గడువులో అమెజాన్ ప్రైమ్ లో విడుదల చేయబోతున్నట్టు టాక్. అయితే విడుదలైన ఎన్నిరోజులకు స్ట్రీమింగ్ కానుంది అన్న విషయంలో క్లారిటీ లేదు. ఇప్పటికే ఈ సినిమాపై పాజిటివ్ బజ్ నడుస్తోంది. ఈ సినిమా దుల్ఖర్ నటజీవితంలోనే ప్రత్యేక చిత్రంగా నిలిచిపోతుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ సినిమాలో ఇంకా గౌతమ్ మీనన్, ప్రకాశ్ రాజ్, సుమంత్, తరుణ్ భాస్కర్ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. పీయస్ వినోద్ ఛాయాగ్రహణం నిర్వహిస్తున్నారు. ఈ సినిమాలోని ప్రధాన భాగం కాశ్మీర్‌లో షూటింగ్ జరుపుకోవడం విశేషం. ప్రపంచంలోనే ఎత్తైన ప్రాంతంలో ఉన్న ఒక పోస్టాఫీస్‌లో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించారు. హీరో ఇక్కడి నుంచే కథానాయికకు ఉత్తరాలు రాస్తాడు. కథను కీలక మలుపు తిప్పే ఈ సన్నివేశాలు సినిమాకే హైలైట్‌గా నిలుస్తాయని చెబుతున్నారు. ఈ సీన్స్ కోసం చిత్ర బృందం ఎన్నో కష్టాలు పడ్డట్టు దర్శకుడు హను రాఘవపూడి ఒక ఇంటర్వ్యూలో తెలిపారు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8897334003 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in